క్లుప్తంగా

మంత్రికి సాదర స్వాగతం


విమానాశ్రయంలో మంత్రి వేణుగోపాలకృష్ణకు స్వాగతం పలుకుతున్న జిల్లా అధికారులు

రేణిగుంట: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు మంగళవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో జిల్లా బీసీ అధికారులు పుష్పగుచ్ఛాలను ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డుమార్గాన తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ దర్శనార్థం వెళ్లారు.

సత్యవేడు-2ఎస్ఐగా శ్రీకాంత్ రెడ్డి



సత్యవేడు: సత్యవేడు పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐ2గా శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. పిచ్చాటూరు నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు.

వేడుకగా గెరిగ ఉత్సవం


గెరిగ ఉత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరి దళితవాడలో నిర్వహిస్తున్న గంగ జాతరలో భాగంగా మంగళవారం గెరిగ ఉత్సవం నిర్వహించారు. ప్రజలు గెరిగకు పసుపు నీళ్లు, కర్పూర హారతులు సమర్పించి నీరాజనాలు పలికారు. గ్రామంలో వేపాకు తోరణాలు విద్యుత్ కటౌట్ల ఏర్పాట్లతో పండుగ వాతావరణం సంతరించుకుంది.

ట్యాబ్‌ల పంపిణీ

వెంకటగిరి: పట్టణంలోని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులకు మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ నక్కా భానుప్రియ తన కార్యాలయంలో ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కౌన్సిలర్లు శేఖర్, గోపాలకృష్ణయ్య, మాడా జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): నివాసాల మధ్య వేసుకున్న గడ్డివామి ప్రమాదవశాత్తు దగ్ధమైన ఘటన బాలాయపల్లి మండలంలోని వెంగమాంబపురంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వెంగమాంబపురం గ్రామానికి చెందిన బాపన పెంచలయ్య తమ పశువుల మేత కోసం 400 మో పుల గడ్డిని వామి వేసుకున్నారు. గడ్డివామి స మీపంలో ఉన్న విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పు రవ్వలు రాలి పడడంతో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

అవగాహన కల్పించాలి

నాయుడుపేటటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన, పౌష్టికాహారం తదితర విషయాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు వారి కేంద్రాల పరిధిలోని మహిళలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరి తెలిపారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద పూర్వ ప్రాథమిక విద్య, జనబాగీదారి కార్యక్రమంపై మంగళవారం అంగన్ వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధి లోని నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

తేనెటీగల దాడి - ముగ్గురికి గాయాలు

కోట: స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం తేనెటీగలు దాడి చేయడంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. కార్యాలయం వద్ద ఉన్న చెట్టుకు తేనెతుట్టె ఉంది. దాని నుంచి తేనెటీగలు ఒక్కసారిగా లేచి, అక్కడ ఉన్న వారిపై దాడి చేశాయి. దీంతో జనం భయపడి పరుగులు తీసి, అక్కడ దుకాణాల్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఈ క్రమంలో పద్మమ్మ, శ్రీలక్ష్మి, రమణయ్యలను తేనెటీగలు కుట్టడంతో గాయపడ్డారు. వారు కోట ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందారు.

అధిక లోడ్‌తో ప్రమాదాలు

చిల్లకూరు: ఆటోల్లో పరిమితికి మించి అధికలోడ్‌తో ప్రయాణికులను తరలిస్తుండడంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయని ఎస్ఐ గోపాల్ అన్నారు. చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు కూడా ప్రయాణికులతో దురుసుగా వ్యవహరించకూడదని చెప్పారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు

- విద్యాకానుక కిట్ల పంపిణీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: కార్పొరేట్ స్కూళ్లకంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి, నాణ్యతా ప్రమాణాలతో విద్యాబోధన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని, వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు అన్నింటా రాణించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో మంగళవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను, ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసే విధానాలను అనుసరించిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక విద్యకు సైతం అధిక ప్రాధాన్యత ఇచ్చి, పలు పథకాలతో విద్యారంగానికి జవసత్వాలు నింపిందన్నారు. జగనన్న గోరుముద్ద పథకంతో విద్యార్థులకు పౌష్టికాహారం, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన ఇత్యాది పథకాలతో ఎంతో మేలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్పీ రమేషయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రతిమ, తేఎంసీ చైర్‌పర్సన్ ఉగ్గుమూడి సంధ్య, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, తహసీల్దారు హనుమాన్‌నాయక్, ఎంపీడీఓ నరసింహరావు, ఎస్ఐ మంజునాథరెడ్డి, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, మణినాయుడు, హరిబాబు, మునస్వామి, భాస్కరయ్య, సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా, పాఠశాల చైర్మన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటించనున్నట్లు ఎంఈఓలు హేమమాలిని, బాబయ్య తెలిపారు. ఉదయం 9 గంటలకు కీళపూడిలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల, 10.30 గంటలకు నాగలాపురంలోని వర్తక సంఘం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగనన్న విద్యాకానుకను ఎమ్మెల్యే పంపిణీ చేస్తారని తెలియజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు హాజరు కావాలని వారు కోరారు.


బుచ్చినాయుడుకండ్రిగ: జేవీకే కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: స్థానిక సన్నిధివీధిలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్లను శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న, ఉపాధ్యాయురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాళహస్తి : విద్యాకానుక కిట్లను అందజేస్తున్న అంజూరు

పులికుండ్రంలో..

పిచ్చాటూరు: మండలంలోని పులికుండ్రం జెడ్పీ హైస్కూలులో మంగళవారం జగనన్న విద్యాకానుకను అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. హెచ్ఎం ఈశ్వర్‌కుమార్, గ్రామ సర్పంచ్ దిలీప్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ దొరైరాజ్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


పిచ్చాటూరు : పులికుండ్రంలో..

శ్రీకాళహస్తి మండలంలో..

శ్రీకాళహస్తి: స్కూళ్లలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేసినట్లు ఎంఈఓ భువనేశ్వరి తెలిపారు. తొండమనాడు, ఎగువవీధి, ఊరందూరు, అక్కుర్తి, బీవీపురం, వాంపల్లె, రాచగున్నేరి ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, వెంకటరమణ, రాజకుమారి, రమేష్‌బాబు, లక్ష్మయ్య, అంబటి బాలయ్య, జయకుమారి తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాళహస్తి : విద్యాకానుక కిట్లను అందుకున్న విద్యార్థులు

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్లను మొత్తం 750మంది విద్యార్థులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మప్రియ, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ అబ్దుల్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, సర్పంచ్ జ్యోతి, స్కూల్ కమిటీ చైర్మన్ వెంకటేష్, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, ఎంఈఓ సరస్వతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిసుబ్రమణ్యం, ఎస్ఐ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. అనంతరం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పెట్టిన పులిహోరను ఆయన రుచి చూచి సంతృప్తి వ్యక్తం చేశారు.


జగనన్న విద్యా కానుక కిట్లను అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే ఆదిమూలం

ఆర్థిక భారం తప్పింది



ఒకప్పుడు స్కూళ్లు ప్రారంభమయితే మాలాంటి పేదలు పిల్లలకు పుస్తకాలు కొనలేక ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు జగనన్న రూ. 2600 విలువ చేసే విద్యా కానుక రూపంలో యూనిఫాం, నోటు పుస్తకాలు, బ్యాగులు, ఇతర విద్యా సామగ్రి ఇవ్వడంతో ఎంతో సంతోషంగా ఉంది. కష్టాలు తప్పాయి. సీఎంకు రుణపడి ఉంటాం.

– షర్మిల, పదో తరగతి విద్యార్థినితో తల్లి సీమ, వరదయ్యపాళెం హైస్కూల్

సీఎంకు రుణపడి ఉంటాం



నాకు ఇద్దరు కొడుకులు. పెద్దోడు ఇంటర్ రెండో సంవత్సరం, రెండోవాడు పవన్ వరదయ్యపాళం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. కూలి పనులపై ఆధారపడిన మాకు వారిద్దరి చదువులు భారమే. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా మా పిల్లల చదువులకు కష్టాలు తప్పాయి. విద్యాకానుక కిట్లు ఇవ్వడంతో పుస్తకాలు మొదలైనవి కొనే బాధ తప్పింది. సీఎంకు రుణపడి ఉంటాం. – విద్యార్థి పవన్‌తో తండ్రి శేఖర్, గోవిందరాజు

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లండి


కిలివేటికి వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

నాయుడుపేట: కాంట్రాక్ట్ జూనియర్ అధ్యాపకులను కూడా రెగ్యులర్ చేయాలని సీఎం దృష్టికి తీసుకుని వెళ్లాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు నాయుడుపేటలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. ఐదేళ్ల కాలపరిమితిని ఎత్తివేస్తే కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేస్తున్న అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని సూచించారు. తమని రోస్టర్ పద్ధతిలో ఎంపిక చేశారని అర్హత ఉన్న తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేసి, సీఎం తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె.సుగుణ, ఎస్.సుకీర్తి, టీ.అనిత, ఎ.లక్ష్మి, ఎస్.నాగమణి, ఎస్.సౌజన్యసుధ, పీ.స్వర్ణ పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదాం


సమావేశంలో మాట్లాడుతున్న శిరీష

ఏర్పేడు: బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదామని ప్రగతి సంస్థ మండల కో–ఆర్డినేటర్ శిరీష అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ, బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్షార్హులవుతారన్నారు. బడిఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు పలు ప్రభుత్వ పథకాలు


మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ రఘుబాబు

చిల్లకూరు: మత్స్యకార సొసైటీల్లో సభ్యులకు ప్రభుత్వం పలు పథకాలను అందిస్తుందని చిల్లకూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రఘుబాబు తెలిపారు. మండలంలోని కడివేడు చెరువుకు సబంధించిన సొసైటీ సభ్యులతో తిమ్మనగారిపాళెంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేస్తుందని, ఆసక్తి కలిగిన వారు ముందుకు వస్తే రాయితీపై అవుట్‌లెట్ మంజూరు చేయిస్తామన్నారు. అలాగే ప్రధాన మంత్రి మత్స్యకార పథకాల కింద ఆటోలు, చేపల రవాణాకు సంబంధించిన 4 చక్రాల ఆటోలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

ఆహార భద్రత.. మీ బాధ్యత

- ఎస్వీ వ్యవసాయ కళాశాల వార్షికోత్సవంలో కమిషనర్ హరిత

తిరుపతి ఎడ్యుకేషన్: సమాజంలో వ్యవసాయ రంగానిదే అగ్రస్థానమని, ఈ రంగంలో సాంకేతికత మరింత అభివృద్ధి చెంది ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ విద్యార్థులపై ఉందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత అన్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో మంగళవారం జరిగిన వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. తిరుపతి వ్యవసాయ కళాశాలకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న వారిలో పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లతో పాటు గ్రూప్–1 స్థాయి అధికారులు సమాజానికి సేవలందిస్తుండడం ఈ కళాశాలకు గర్వకారణమని తెలిపారు.

మరింత మంది ప్రజా సేవకులు, రైతు సేవకులు ఈ కళాశాల నుంచి సమాజంలోకి రావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆహార పదార్థాల్లో రసాయనాలు అధిక మోతాదులో ఉన్నాయంటూ వస్తున్న హెచ్చరికల నేపథ్యంలో ప్రజా ఆరోగ్య దృష్ట్యా సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దీని కోసం శాస్త్రవేత్తలు శాస్త్రీయంగా రసాయన రహిత ఆహార ధాన్యాలు, కూరగాయలను సమాజానికి అందించేలా కృషి చేయాలని కోరారు.


జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న కమిషనర్ హరిత

- ఏఎస్పీ జె.వెంకటరావు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి వ్యవసాయ విద్యార్థులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు చేస్తున్న కృషితో నేడు వ్యవసాయ రంగంలో మనం రాణిస్తున్నామని తెలిపారు. కలుషితం లేని ఆహార ఉత్పత్తుల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఆ దిశగా నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు ఫలితాలు రాబట్టాలని కోరారు. వార్షికోత్సవం సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ పి.సుధాకర్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జి.ప్రభాకరరెడ్డి, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ సి.రమణ, విద్యార్థి వ్యవహారాల అధికారి కేవీ.హరిప్రసాద్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

- ఇళ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: పేదల సొంత ఇంటి కలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అరణివిద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో వేణుగోపాలపురం ఎస్టీ కాలనీలోని 20 మంది ఇల్లులేని పేదలకు ఎమ్మెల్యే ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి మాట్లాడారు. నవరత్నాలలో భాగంగా నాలుగేళ్లలో రాష్ట్రంలోని ప్రతి ఒక్క నిరుపేదకూ ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు సీఎం కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. సత్యవేడు నియోజక వర్గంలో మొదటి విడతలో లేఅవుట్లు వేసి 5,826 మందికి పట్టాలు పంపిణీ చేసి, 18,501 పక్కాగృహాలు మంజూరు అయ్యాయన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హులు సమీప సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే 80 రోజుల్లో పట్టా మంజూరవుతుందన్నారు. పట్టాలు ఇచ్చిన లేఅవుట్లు వద్ద ప్రజలకు అవసరమైన వసతుల కల్పనకు కూడా స్థలాలు కేటాయించారన్నారు. ప్రైవేటు వెంచర్లకు ఏమాత్రం తీసిపోని విధంగా రోడ్లు, కాలువలు, బడి, గుడి, పార్కులు, కమ్యూనిటీ భవనాలకు ప్రత్యేకంగా కేటాయించడం ద్వారా ఊళ్లకు ఊళ్లే ఏర్పాటు అవతున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు హనుమాన్‌నాయక్, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, నాయకులు మునిరత్నం నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, విద్యానాథరెడ్డి

డిప్యూటీ ఈఈ వెంకటరమణకు వీడ్కోలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయంలో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న వెంకటరమణకు మంగళవారం కమిషనర్ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు పలికి సన్మానించారు. కమిషనర్ మాట్లాడుతూ, డిప్యూటీ ఈఈగా నాలుగేళ్ల కాలంలో వెంకటరమణ ఎంతో అభివృద్ధి చేశారన్నారు. సీసీరోడ్ల నిర్మాణం, విద్యుత్ దీపాలు ఏర్పాట్లు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఆయన సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో అధికారులు ఉమామహేశ్వరరావు, మధుసూదన్, నారాయణరెడ్డి, లలిత, రవికాంత్, బాలచంద్రయ్య, రవికుమార్, సుధాకరయ్య తదితరులు పాల్గొన్నారు.


వెంకటరమణను సన్మానిస్తున్న కమిషనర్ బాలాజీనాయక్ తదితరులు

అంతర్గత రోడ్ల అభివృద్ధికి చర్యలు


తిరుపతి లక్ష్మీపురం సర్కిల్ వద్ద పనులను పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: నగరంలో అంతర్గత రోడ్లకు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేయనున్నట్లు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి అన్నారు. లక్ష్మీపురం కూడలిలో యూడీఎస్ ఆధునీకరణ, బీటీ రోడ్డుతో పాటు ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కాలేజీ ఇంటర్నల్ రోడ్డు పనులను డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబుతో కలిసి మంగళవారం పరిశీలించారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. అలానే ప్రజారవాణా మెరుగుపరిచేందుకు ఇప్పటికే 7 ప్రాంతాల్లో కూడళ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ పనులు దాదాపు పూర్తి అవుతుండడంతో నగరంలోని ఇంటర్నల్ రోడ్లన్నీ అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. దశలవారీగా పూర్తిచేస్తామని తెలిపారు. రుయా–అన్నారావు కూడళ్ల మధ్య బీటీ రోడ్డు పనులు పూర్తిచేసినట్లు చెప్పారు. అలానే 50 డివిజన్లలోని రోడ్లను మరో ఐదారు నెలల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్స్‌తో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎంఈ చంద్రశేఖర్, డీఈ సంజీవ్‌కుమార్, కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ అమరనాథరెడ్డి, అంకాళమ్మ గుడి చైర్మన్ లక్ష్మయ్య, ఎస్‌కే.జానీ పాల్గొన్నారు.

రుయాలో నేడు రక్తదాతల దినోత్సవం

తిరుపతి తుడా: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి రుయా ఆస్పత్రిలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శ్రీహరి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం మేరకు రక్తదాన శిబిరంలో ఈసారి వైద్యులు, వైద్యాధికారులు, వైద్యసిబ్బంది పాల్గొంటారన్నారు. ప్రజల నుంచే ఎప్పుడూ రక్తదానం చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని సరికొత్తగా నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందన్నారు. 18–65 ఏళ్లలోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. గత ఏడాదిలో 3 సార్లు కంటే ఎక్కువ రక్తదానం చేసిన మహిళలను సత్కరించనున్నట్లు చెప్పారు. అలానే ఇప్పటి వరకు 25 కంటే ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారిని సత్కరించి సర్టిఫికెట్లు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అరుదైన బ్లడ్‌గ్రూప్ దాతలను సత్కరించడమే ఈ ఏడాది రక్తదాతల దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు.

కోర్టు ఆవరణం.. వాహనాల దిగ్బంధం

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలో ఎక్కడి వాహనాలు అక్కడ ఆగిపోవడంతో మంగళవారం న్యాయవాదులు, కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేసవి సెలవుల అనంతరం కోర్టులు ప్రారంభమయ్యాయి. కోర్టు ఆవరణ లోపల వాహనదారులు వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఎదురైంది. వాహనాలను క్రమపద్ధతిలో పెట్టించడానికి ట్రాఫిక్ పోలీసులు గానీ, న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాద సంఘ కార్యవర్గ సభ్యులు ఎవరూ పట్టించుకోకపోవడంతో తరచూ ఇలాగే జరుగుతున్నాయి. కోర్టు ఆవరణం నుంచి న్యాయమూర్తుల అతిథిగృహాల్లోకి వెళ్లే మార్గంలో కార్లను ఎక్కడపడితే అక్కడ నిలపడంతో ముందుగా నిలిపిన వ్యక్తులు తమ కార్లను బయటకు తీయడానికి ఇబ్బందులు పడ్డారు. అధికారులు కోర్టు ఆవరణలోని ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించాలని న్యాయవాదులు, కక్షిదారులు కోరుతున్నారు.


కోర్టు ఆవరణలో ఎక్కడికక్కడ నిలిపివుంచిన వాహనాలు

ఇంటింటా సంక్షేమ కాంతులు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు నిండాయని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బాలాయపల్లి మండలంలోని పాకపూడి, గొట్టికాడు పంచాయతీల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సంక్షేమపథకాల అందుతున్నాయా? లేదా అని స్థానికులను ఆరా తీశారు. లబ్ధిదారులకు ఇప్పటివరకు వారు పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వీ.కార్తీక్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎం.గోపీకృష్ణారెడ్డి, వీ.సుప్రజారెడ్డి, హరికృష్ణారెడ్డి, పార్టీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్.సురేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యులు వేళ్ల సురేంద్ర, ముంగర సుజాత, రామతులసి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

వెంకటగిరి: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం ఆయన పట్టణంలోని ఎగువ బొప్పాపురం, సాలికాలనీల్లో పర్యటించారు. స్థానిక వార్డు కౌన్సిలర్ పీ ప్రభావతి, ఎంఏ నారాయణలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అందుతున్నాయా? లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్‌లను అందజేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జీ.ఢిల్లీబాబు, పార్టీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్.సురేష్‌రెడ్డి, కౌన్సిలర్ వహిదా, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ, న్యాయవాది కోటేశ్వరరావు, నాయకులు వీ.కృష్ణయ్య, పోలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


బుక్‌లెట్ ఇచ్చి సమస్యలు తెలుసుకుంటున్న రామ్‌కుమార్‌రెడ్డి